APTEL/26/A4269

# అనంత సూర్య

www.ananthasurya.com తెలుగువార్త

ప్రచురణ : అనంతపురం / శ్రీ సత్యసాయి ఎడిటర్ : సి హరికృష్ణ గురువారం 13 ఆగస్టు 2026 సంపుటి: 01 సంచిక :7 పేజీలు : 04 వెల: 2-00/-



## అసెంబ్లీకి రాకపోతే జీతం కట్..



అమరావతి, ఆగస్టు 13: ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో శాసనసభా సమావేశాల వేడి పెరిగింది. కాకినాడ జిల్లా తుని పర్యటనలో ఉన్న ఏపీ అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యంగా విరుచుకుపడ్డారు. చట్టసభలకు రాని ప్రజాప్రతినిధుల తీరుపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అసెంబ్లీ సమావేశాలకు హాజరు కాని ఎమ్మెల్యేల జీతభత్యాలను వెనక్కి తీసుకునేలా ప్రత్యేక చట్టం తీసుకురావాలని తాను కేంద్ర ప్రభుత్వాన్ని కోరినట్లు అయ్యన్నపాత్రుడు సంచలన ప్రకటన చేశారు. ప్రజాధనం వృథా కాకుండా ఉండాలంటే పార్లమెంట్ పరిధిలోనే ఇలాంటి కఠిన నిబంధనలు తేవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజా సమస్యలపై అసెంబ్లీలో చర్చించి పరిష్కరిస్తారనే నమ్మకంతోనే ప్రజలు జగన్‌ను గెలిపించారని, కాబట్టి ఆయన బాధ్యతాయుతంగా సభకు హాజరుకావాలని స్పీకర్ స్పష్టం చేశారు. శాసనసభలో ఇకపై దొంగ హాజరులకు తావులేకుండా సరికొత్త డిజిటల్ విధానాన్ని అందుబాటులోకి తెస్తున్నట్లు వెల్లడించారు. ఎమ్మెల్యేలకు కేటాయించిన సీట్లలో వారు ప్రత్యక్షంగా కూర్చున్నప్పుడు మాత్రమే ఆటోమేటిక్ కెమెరాలు ఆన్ అవుతాయని, అప్పుడే వారి హాజరును అధికారికంగా పరిగణనలోకి తీసుకుంటామని ఆయన తేల్చిచెప్పారు. కాగా, ఈ నెల 17న నిర్వహించనున్న బిజినెస్ అడ్వైజరీ కమిటీ సమావేశంలో రాబోయే అసెంబ్లీ సమావేశాలను ఎన్ని రోజుల పాటు నిర్వహించాలనే దానిపై తుది నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. కూటమి ప్రభుత్వం అత్యంత పారదర్శకంగా చేపట్టిన డీఎస్సీ నియామకాలపై జగన్ మరియు వైఎస్సార్‌సీపీ నాయకులు కావాలనే తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని అయ్యన్నపాత్రుడు మండిపడ్డారు. ఎంతో కష్టపడి ఉద్యోగాలు సాధించిన నిరుద్యోగ యువతను హేళన చేసేలా ప్రతిపక్ష నేతలు మాట్లాడటం దారుణమన్నారు. అసలు జగన్‌కు స్పోర్ట్స్ కోటా అంటే ఏంటో, దాని ప్రాముఖ్యత ఏంటో కనీస అవగాహన ఉందా అంటూ ఎద్దేవా చేశారు. అర్హులైన అభ్యర్థులకు ఉద్యోగాలు వస్తే ఓర్వలేక మానసికంగా కుంగదీసేలా వ్యాఖ్యలు చేయడం శోచనీయమని విమర్శించారు. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాలను మార్చే పూర్తి అధికారం కేవలం ప్రజలకు మాత్రమే ఉంటుందని స్పీకర్ స్పష్టం చేశారు. ప్రభుత్వ పాలన, నిర్ణయాలు నచ్చకపోతే తగిన సమయంలో ప్రజలే ఓటు ద్వారా ప్రభుత్వాన్ని మారుస్తారని పేర్కొన్నారు. అంతేగానీ, ప్రభుత్వాన్ని మార్చేయడానికి జగన్ ఎవరు అని నిలదీశారు. ఓటమి నుంచి పాఠాలు నేర్చుకోకుండా ఇప్పటికీ అహంకారపూరిత వైఖరితో వ్యవహరిస్తే ప్రజలు మరింతగా దూరమవుతారని అయ్యన్నపాత్రుడు హెచ్చరించారు.



## ఇక అన్నింటికీ తెర దించినట్టే.. !!


ఢిల్లీ, ఆగస్టు 13: దేశవ్యాప్తంగా తీవ్ర చర్చకు దారితీసిన విదేశీ విరాళాల నియంత్రణ సవరణ బిల్లు పై కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రతిపక్షాలు, వివిధ స్వచ్ఛంద సంస్థల నుంచి వ్యక్తమవుతున్న పలు అభ్యంతరాల నేపథ్యంలో.. ఈ వివాదాస్పద బిల్లును జాయింట్ పార్లమెంటరీ కమిటీకి పంపాలని నిర్ణయించింది. దీనిపై లోక్ సభలో ఓ తీర్మానాన్ని కూడా కొద్దిసేపటి కిందటే ప్రవేశపెట్టింది. ప్రతిపక్షాల నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదురవుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో ఈ బిల్లుపై కేంద్రం యూటర్న్ తీసుకున్నట్టయింది. దీన్ని జేపీసీ పరిశీలనకు పంపడానికి సుముఖత వ్యక్తం చేసింది. దీంతో లోక్ సభ, రాజ్యసభలో ఇప్పటివరకూ కొనసాగుతూ వస్తోన్న ప్రతిష్టంభనకు కేంద్రం తెరదించినట్టయింది. వివాదాలు, విమర్శలకు ముగింపు పలికినట్టయింది. దీన్ని పరిశీలించడానికి ప్రత్యేకంగా జేపీసీని వేసే అవకాశాలు కూడా లేకపోలేదని సమాచారం. కాగా.. ఎఫ్సీఆర్ఏ సవరణ బిల్లును పూర్తిగా ఉపసంహరించుకోవాలంటూ మొదటి నుంచీ ప్రతిపక్షాలు గట్టిగా డిమాండ్ చేస్తూ వస్తోన్నాయి. దీనిపై పార్లమెంట్ ఉభయ సభల కార్యకలాపాలను స్తంభింపజేస్తోన్నాయి. అటు దేశంలోని సామాజిక సంస్థలు, వివిధ చర్చి అనుబంధ సంఘాలు కూడా ఈ బిల్లులో ప్రతిపాదించిన కొన్ని మార్పులపై క్షేత్రస్థాయిలో తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తోన్న విషయం తెలిసిందే. ప్రత్యేకించి.. విదేశీ విరాళాల ద్వారా గతంలో సమకూర్చుకున్న ఆస్తులకు సంబంధించిన నిబంధనలపై తీవ్ర అభ్యంతరం వ్యక్తమౌతోంది. ఈ బిల్లులో పొందుపరిచిన ఆస్తుల స్వాధీన నిబంధనలు తమ ఉనికికే ప్రమాదకరంగా మారుతాయని పలు మత సంస్థలు ఆందోళన చెందుతోన్నాయి. గతంలో సేకరించిన విదేశీ నిధుల ద్వారా కొనుగోలు చేసిన ఆస్తులను జప్తు చేయడానికి లేదా నాటి పెట్టుబడులను స్తంభింపజేయడానికి ఈ తాజా ప్రతిపాదనలు వీలు కల్పిస్తాయని ఆరోపించాయి. దీనివల్ల ప్రార్థనా మందిరాలు, సేవా కార్యక్రమాలు నిలిచిపోతాయని వారు ఆవేదన వ్యక్తం చేశాయి. ఈ పార్లమెంటరీ కమిటీ పరిశీలన ద్వారా బిల్లులోని వివాదాస్పద అంశాలపై త్వరలోనే పూర్తిస్థాయిలో స్పష్టత వచ్చే అవకాశం ఉంది. అన్ని వర్గాల నుంచి సలహాలు, సూచనలను సేకరించిన తర్వాతే తుది బిల్లుపై పార్లమెంట్‌లో తదుపరి నిర్ణయం తీసుకోనున్నారు. దీనివల్ల ఇటు ఉభయ సభల్లో చర్చ సాఫీగా సాగడంతో పాటు, ప్రజాసంఘాల ఆందోళనలకు కూడా ప్రభుత్వం సానుకూల పరిష్కారం చూపినట్లవుతుందని భావిస్తున్నారు.

## ఏపీలో సీట్లు పెరగవు... 2029 లో అంతేనా ?

ఏపీ ఆగస్టు 13: ఏపీలో ప్రస్తుతం ఉన్న సీట్లతోనే ఎన్నికలు జరుగుతాయా అంటే జరుగుతున్న పరిణామాలు అలాగే కనిపిస్తున్నాయి. ఏపీయే కాదు, దేశమంతా సీట్లు పెరగాలంటే డీలిమిటేషన్ బిల్లు తప్పనిసరిగా పార్లమెంట్ ఆమోదం పొంది తీరాల్సి ఉంది. కానీ పార్లమెంట్ తీరు చూస్తే అలా జరిగే చాన్స్ కనిపించడం లేదు. ఆ మాటకు వస్తే వర్షాకాల సమావేశాలు పూర్తిగా వర్షార్పణం అయిపోయాయి. కేవలం రెండు రోజులు మాత్రమే మిగిలి ఉంది. దాంతో డీలిమిటేషన్ బిల్లు మహిళా బిల్లు ఆమోదం పొందుతుంది అనుకుంటే అది జరిగేట్టు లేదు, ఇపుడు కాకపోతే ఈ బిల్లులు మరెప్పుడు అన్న కొత్త చర్చ కూడా సాగుతోంది. నిజానికి పార్లమెంట్ లో డీలిమిటేషన్ బిల్లు ఈసారి ఖాయంగా నెగ్గుతుందని ముందు అనుకున్నారు. దానికి తగిన పూర్వ రంగాన్ని బీజేపీ సమకూర్చి పెట్టుకుంది. ఏప్రిల్ 16, 17 తేదీలలో జరిగిన పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలలో ఎన్డీయేకు 298 ఓట్లు వచ్చాయి. 362 ఓట్లకు గానూ 64 ఓట్లు తక్కువ పడ్డాయి. అయితే వాటిని ఈ మధ్య కాలంలో సాధించుకునే పనిలో చాలా వరకూ బీజేపీ సక్సెస్ అయింది. అలా కొత్తగా 30 మంది దాకా ఎంపీలు బీజేపీకి వివిధ పార్టీల నుంచి చీలి మద్దతు తెలిపారు. మరి కొన్ని పార్టీలు పరోక్షంగా సహకారం అందించేందుకు రెడీ అయ్యాయి. కానీ పార్లమెంట్ జరిగితేనా అన్నదే ఇక్కడ పెద్ద ఇబ్బంది. ఇక పార్లమెంట్ లో ప్రతీ రోజూ జంతర్ మంతర్ వద్ద విద్యార్థులు చేసిన ఆందోళన దాని పర్యవసానాల మీదనే విపక్షాలు పట్టు బట్టి కూర్చున్నాయి. మరో వైపు డీఎంకేకు తమిళనాడులో అధికారంలో ఉన్న విజయ్ ప్రభుత్వం ముకుతాడు వేసింది. అఖిల పక్షం పేరుతో



డీలిమిటేషన్ బిల్లుకు మద్దతు ఇచ్చేది లేదని విజయ్ పార్టీ స్పష్టం చేసింది. దాంతో డీఎంకేకి కూడా ఇది ఇరకాటంగా మారింది. అంతే కాదు దేశంలో మారుతున్న రాజకీయ వాతావరణం జెన్ జీ ఆగ్రహాల మధ్య డీఎంకే కూడా ఒకటికి రెండు సార్లు ఆలోచించుకుని వెనక్కి వెళ్ళింది అన్న చర్చ కూడా సాగింది. మొత్తం మీద ఏమైతేనేమి డీలిమిటేషన్ (మిగతా 2వ పేజీలో)



## ఉచితాలే రాజకీయ మంత్రం.. గెలుపు తర్వాత అదే ప్రజలకు గుదిబండ!

ఆంధ్రప్రదేశ్, ఆగస్టు 13: ఒకప్పుడు పాలిటిక్స్ అంటే.. మంచి నేతలు.. క్లీన్ చిట్ ఉన్న నాయకులు కనిపించేవారు.. వారి మాటలు వినిపించేవి. ఇప్పుడు అవేవీ లేవు!. ఆశ్చర్యంగా ఉన్నా నిజం. మీకు ఓటేస్తే మాకేంటి? అనే ట్రైపులో ఇటు ఓటర్లు.. మాకు ఓటేస్తే.. మీకిది!.. అంటూ నాయకులు కూడా విచ్చల విడి హామీలు గుప్పిస్తున్నారు. వీటిలో ప్రధానంగా ఉచిత పథకాలపై తెలంగాణ హైకోర్టు కన్నెర్ర చేసింది. అయితే.. న్యాయవ్యవస్థకు ఏం తెలుసు మా కష్టాలు.. అని నాయకులు బుగ్గలు నొక్కుకుంటున్నారు.తాజాగా తమ నుంచి వసూలు చేసిన సర్ చార్జీని వెనక్కి ఇప్పించాలంటూ దాఖలైన ఓ పిటిషన్‌పై విచారణ చేసిన తెలంగాణ హైకోర్టు ఉచిత పథకాల అమలుపై తీవ్ర వ్యాఖ్యలే చేసింది. కూర్చుంటే.. సొమ్ము, నించుంటే సొమ్ము అంటూ తనదైన బాణీలో విమర్శలు గుప్పించింది. అయితే.. ఉచితాలపై కోర్టులు ఇలా వ్యాఖ్యానించడం కొత్తకాదు.. నాయకులు, పార్టీలు వాటిని పెడచెవిన పెట్టడమూ కొత్తకాదు. గత మూడేళ్ల కిందటే సుప్రీంకోర్టులో ఉచిత పథకాలపై పిటీషన్లు దాఖలయ్యాయి. ఈ విషయంలో తాము జోక్యం చేసుకునేది లేదని సర్వోన్నత న్యాయస్థానం అప్పట్లోనే తేల్చి చెప్పింది. పార్టీలు వ్యక్తిగతంగా ఆలోచన చేసుకోవాలని కూడా కోరింది. ఇదే సమయంలో కేంద్ర ప్రభుత్వం వివరణ కూడా కోరింది. అయితే.. తాము వ్యతిరేకమంటూ.. కేంద్రం ముక్తసరిగా సమాధానం ఇచ్చి ఊరుకుంది. కానీ,

*ఏం చేయాలి? ● ఉచితాలకు బదులుగా.. సంస్థాగత అభివృద్ధికి సంబంధించిన పథకాలను ప్రకటించాలి. ● వ్యక్తిగత లబ్ధి కంటే కూడా.. సామాజిక ప్రయోజనాలకు పెద్దపీట వేయాలి. ● వేల కోట్ల రూపాయలను ఉచితాలకు ఇస్తున్న పార్టీలు.. ఈ దిశగా ఆలోచన చేయాలి. ● అధికారమే పరమావధి అయినా.. పార్టీలు ఉచితాల నుంచి మేల్కొనాల్సిన అవసరం ఉంది. ● ఒక పార్టీని చూసి మరోపార్టీ చేతులు కాల్చుకునే పరిస్థితి రాకుండా ఉండడమే కాదు.. ప్రజలను సైతం ఆ దిశగా మళ్లించాలి.. ఒప్పించాలి!.*

## శ్రావణం ప్రారంభం చేయాల్సిన నియమాలు..!!

హిందూ సాంప్రదాయంలో శ్రావణ మాసంకు ఎంతో ప్రత్యేకత ఉంది. శుభకార్యాలకు ఈ మాసం ఎంతో అనువైనదిగా భావిస్తారు. ఈ పవిత్ర మాసంలో శ్రీ మహాలక్ష్మి, శ్రీ మహావిష్ణువు మరియు పరమశివుడిని ఆరాధించడం వల్ల అనంతమైన పుణ్యఫలాలు లభిస్తాయని చెబుతారు. ఈ మాసం లో ముఖ్యమైన రోజులు.. చేయాల్సిన పూజలు.. చేయాల్సిన పనులు, నియమాల పైన పండితులు స్పష్టత ఇస్తున్నారు. శ్రీ మహావిష్ణువు జన్మ నక్షత్రం కూడా శ్రావణా నక్షత్రమే కావడం ఈ మాసానికి మరింత ప్రాముఖ్యత ను తెచ్చిపెడుతుంది. శుభ ముహూర్తాలు, పండుగలు, పర్వదినాలు, పూజలకు ప్రసిద్ధి గాంచింది శ్రావణ మాసం. ఈ నెల రోజుల్లో శుభకార్యాలు, వివాహాలు ఎక్కువగా జరుగుతాయి. రేపు(గురు వారం ) నుంచి శ్రావణమాసం ప్రారంభం (మిగతా 2వ పేజీలో)



# కొత్త పార్టీ పేరు అదేనా ?


వైసీపీకి చెందిన మాజీ నేత, మాజీ ఎంపీ వి విజయసాయిరెడ్డి కొత్త పార్టీ సన్నాహాలలో ఉన్నారా అంటే అవును అని పొలిటికల్ సర్కిల్స్ నుంచి వినిపిస్తోంది. వైసీపీ పుట్టుక నుంచి ఆ పార్టీలో ఉన్న విజయసాయిరెడ్డి రాజకీయంగా గణనీయమైన అనుభవం సంపాదించారు. వైసీపీకి ఆయన పునాదిగా నిలబడ్డారు. వ్యూహాలతో పాటు రాజకీయ చాతుర్యం ఆయనకు ఉంది. అయితే వైసీపీలో ఆయన తనకు తగిన ప్లేస్ లేదని భావించి 2025 జనవరి 25న ఆ పార్టీ నుంచి తప్పుకున్నారు. ఇప్పటికి ఇరవై నెలలు అయింది. విజయసాయిరెడ్డి రాజకీయ దారి ఏమిటి అన్నది ఎవరికీ తెలియడం లేదు, ఆయన వైసీపీలో తిరిగి చేరుతారు అని ప్రచారం కూడా ఈ మధ్యనే సాగింది. అయితే అంతలోనే విస్మయపరిచే వార్త ఒకటి వినిపిస్తోంది. అదే విజయసాయిరెడ్డి కొత్త పార్టీ పెట్టబోతున్నారు అని. విజయసాయిరెడ్డి కొత్త పార్టీ పెట్టడం నిజమేనా అంటే అవును అన్నట్లుగా పేరు కూడా ప్రచారంలోకి వస్తోంది. ఆయన పెట్టబోయే పార్టీ పేరు భారత్ జన వికాస్ పార్టీ అని నామకరణం కూడా సూత్రప్రాయంగా చేసినట్లుగా చెబుతున్నారు. అంటే షార్ట్ కట్ లో బీజేవీ అన్న మాట. బీజేపీకి దగ్గరగా ఉన్నట్లుగా సౌండ్ వినిపిస్తోంది కదూ. అవును బీజేపీని ఇటీవల కాలంలో ఎంతగానో పొగుడుతూ వస్తున్న విజయసాయిరెడ్డి తన కొత్త పార్టీలోనూ ఆ సౌండ్ వచ్చేలా చూసుకుంటున్నారా లేక యాధృచ్ఛికంగా ఇదంతా జరిగిందా అన్నది అయితే అంతా ఆలోచిస్తున్నారు. అయితే విజయసాయిరెడ్డి అవసరం అయితే తానే ఒక కొత్త పార్టీని



పెడతాను అని గతంలోనే శ్రీకాకుళం పర్యటన సందర్భంగా ప్రకటించారు. ఇపుడు అదే అమలు చేస్తున్నారు అని అంటున్నారు. ఆయన వైసీపీలో చేరుతారు అన్నది కేవలం పుకారు మాత్రమే అని ఈ పరిణామంతో తెలుస్తోంది. అదే సమయంలో ఆయన బీజేపీలో చేరేందుకు ప్రయత్నాలు చేశారు అన్న వార్తలు వినిపించినా అది వర్కౌట్ కాలేదని కూడా అంటున్నారు. దాంతో విజయసాయిరెడ్డి తన సొంత దారిలోనే రాజకీయం మళ్లీ స్టార్ట్ చేయబోతున్నారు అని అంటున్నారు. మరి కొత్త పార్టీ పేరు అయితే బయటకు వినిపిస్తోంది. ఇంతకీ రిజిస్ట్రేషన్ జరిగిందా లేదా అన్నది తెలియడం లేదు. రిజిస్ట్రేషన్ అంటూ జరిగితే జెండా అజెండా అన్నీ కూడా అఫీషియల్ గానే బయటకు వస్తాయని అంటున్నారు. మరో వైపు చూస్తే విజయసాయిరెడ్డి కొత్త పార్టీ పెడితే ఏపీ రాజకీయాల్లో దాని ప్రభావం ఏ మేరకు ఉంటుంది అన్న చర్చ కూడా సాగుతోంది. ఆయన జగన్ వెనక ఉంటూ వ్యూహాలు రచించిన నేతగాన అంతా చూస్తారు. రాజకీయాల్లో పార్టీ పెట్టడం అంటే ఇమేజ్ ఉండాల్సిన అవసరం ఉంది. అలాగే బలమైన భావజాలం కూడా ఉండాలి. లేకపోతే ఎన్నో పార్టీలు పుట్టినట్లుగానే అవుతుందని అంటున్నారు. అయితే విజయసాయిరెడ్డి ఒక పద్ధతి ప్రకారమే తన కొత్త రాజకీయ పార్టీని ప్రకటించబోతున్నారు అని అంటున్నారు. దాంతో పాటుగా సొంత మీడియాను కూడా ఆయన తీసుకుని వస్తారని అంటున్నారు. ఆ విధంగా అండగా దండగా ఉండేలా అన్ని విధాలుగా ప్లాన్ చేసుకుంటున్నట్లుగా ప్రచారం సాగుతోంది. ఇటీవలనే విజయసాయిరెడ్డి జెన్ జీ ని పొగుడుతూ ట్వీట్ చేశారు. దాంతో ఆయన జెన్ జీతో కలసి తన కొత్త పార్టీని రూపు దిద్దుతారా అన్నది కూడా చర్చగా ఉంది. ఏది ఏమైనా విజయసాయిరెడ్డి పార్టీ పెడితే మాత్రం ఏపీ రాజకీయాల్లో అది కొంత వరకూ సంచలనం అవుతుందని అంటున్నారు.

# ఏపీలో మూడవ ఫ్రంట్...?

ఏపీలో సార్వత్రిక ఎన్నికలకు ఇంకా మూడేళ్ళ దాకా సమయం ఉంది. కానీ ఏపీలో రాజకీయ వేడి చూస్తే వేసవిని తలపిస్తోంది. ఆ మాటకు వస్తే 2024 ఎన్నికలు జరిగిన తరువాత నుంచి కూడా ఎన్నికల వేడి అలాగే ఉంది కానీ ఎక్కడా తగ్గలేదు. అధికార కూటమి విపక్ష వైసీపీ ఢీ అంటే ఢీ కొడుతూ చేస్తున్న రాజకీయం మూలంగానే నిరంతరం రాజకీయం దూకుడుగానే సాగుతోంది. ఈ నేపథ్యంలో కొంత మంది ప్రముఖులు కూడా రాజకీయ ఆసక్తితో ముందుకు వస్తున్నారు. వారిలో మాజీ పోలీసు అధికారి ఏబీ వెంకటేశ్వరరావు ఒకరు. ఆయన గత కొంతకాలంగా ఏపీలో రాజకీయ ప్రకటనలు చేస్తూ వస్తున్నారు. అంతే కాదు ఏపీ రాజకీయాల మీద ఆయన డిబేట్లు పెడుతున్నారు. తనదైన శైలిలో విశ్లేషణలు చేస్తున్నారు. ఇక చూస్తే తాజాగా ఆయన ఒక సంచలన ప్రకటన చేసారు. తాజాగా ఏబీ వెంకటేశ్వరారావు వామపక్షాలు ప్రజా సంఘాలు మేధావులతో కూడిన ఒక రౌండ్ టేబుల్ సమావేశానికి అటెండ్ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన ఏపీలో కొత్త ఫ్రంట్ గురించి చేసిన వ్యాఖ్యలు కీలకంగా మారాయి. ఏపీ రాజకీయాల్లో కొత్త ఫ్రంట్ అవసరం ఉందని ఆయన అన్నారు. అధికార కూటమి విపక్ష వైసీపీ రెండూ ఒక్కటే అని ఏబీవీ వ్యాఖ్యానించడం విశేషం. ఈ రెండు పార్టీలకు వ్యతిరేకంగా మూడో ఫ్రంట్ రావాల్సిన అవసరం ఉంది అని అన్నారు. అంతే కాదు తమదే సెకండ్ ఫ్రంట్ అవుతుందని కూడా ధీమాగా చెప్పారు. అంతే కాదు రిటైర్డ్ ఐపీఎస్ అధికారి మాజీ ఇంటెలిజెన్స్ చీఫ్ ఏబీ వెంకటేశ్వరరావు ఏపీ రాజకీయాల్లో ఒక కొత్త వేదిక లేదా ఫ్రంట్‌ను ఏర్పాటు చేసే దిశగా అడుగులు వేస్తున్నారు అని అంటున్నారు. అది ఎలా అన్నదే ఇపుడు చర్చగా ఉంది. ఆయన ఇతర పార్టీల్లోని అసంతృప్తులు, మేధావులు, సామాజిక కార్యకర్తలను కలుపుకుని ఒక ప్రత్యామ్నాయ వేదికను తెస్తానని ఇటీవల పేర్కొంటున్నారు. అయితే ఏబీ వెంకటేశ్వరరావు ఫ్రంట్ ముఖ్య ఉద్దేశాలు ఏమిటి ఎలా ఉంటాయన్నది కూడా అంతా ఆలోచిస్తున్నారు. అయితే దీని మీద కూడా సూత్రప్రాయంగా తెలుస్తున్న సమాచారం ఏమిటి అంటే రాష్ట్రంలో మేధావులు, సామాజిక ఉద్యమకారులు నిపుణులతో కూడిన ఒక నూతన ప్రజా వేదికను ఏర్పాటు చేయడం అన్నదే ఆయన ఉద్దేశ్యం గా కనిపిస్తోంది అని అంటున్నారు. అలాగే కుల మతాలకు అతీతంగా సెక్యులర్ భావజాలంతో ఈ వేదిక పనిచేస్తుందని అంటున్నారు. ఇక రాజకీయాల్లో నైతికతను తీసుకురావడం వివిధ సమస్యల మీద అవస్థలు పడుతున్న వారికి పేదలకు, బాధితులకు అండగా నిలవడం ఫ్రంట్ ప్రధాన లక్ష్యంగా చెబుతున్నారు. అంతేఅ కాదు ప్రస్తుత కూటమి ప్రభుత్వాన్నే కాదు గతంలో అధికారంలో ఉన్న వైఎస్ జగన్ పాలనలోని వ్యతిరేక విధానాలపై తీవ్రస్థాయిలో గళం విప్పడం కూడా ఈ ఫ్రంట్ ఆలోచనలుగా చెబుతున్నారు. ఏపీలో కొత్త రాజకీయం అవసరం అని కూడా పదే పదే ఏబీ



చెబుతున్నారు. ఏపీలో మత భావజాలం మెల్లగా విస్తరిస్తోంది అని దానిని అదుపు చేయాల్సిన పరిస్థితులు కూడా ఉన్నాయని తాజా సమావేశంలో ఏబీవీ చెప్పుకొచ్చారు. భావ స్వేచ్ఛకు అలాగే ప్రజాస్వామిక విలువలకు పట్టం కట్టే విధంగా రాజకీయం ఉండాలని ఆయన అంటున్నారు. మరి వివిధ పార్టీలతో ఏబీవీ ఏర్పాటు చేసే ఫ్రంట్ ఏపీ రాజకీయాల దశ దిశను మారుస్తుందా అన్నది చూడాల్సి ఉంది.

# తిరిగి గులాబీ గూటికి..!?

తెలంగాణ , ఆగస్టు 13: తెలంగాణ రాజకీయాల్లో కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. వచ్చే ఎన్నికలే లక్ష్యంగా సీఎం రేవంత్ కొత్త వ్యూహాలు అమలు చేస్తున్నారు. ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీ ను టార్గెట్ చేస్తూ ముందుకు వెళు తున్నారు. అటు బీఆర్ఎస్, బీజేపీ సైతం గ్రేటర్ ఎన్నికలకు సమాయత్తం అవుతూ.. సీఎం రేవంత్ పైన గురి పెట్టారు. ఇదే సమయంలో బీఆర్ఎస్ నుంచి గెలిచి కాంగ్రెస్ కు దగ్గరైన నేతల తీరులో మార్పు కనిపిస్తోంది. తిరిగి కేసీఆర్ నాయకత్వానికి మద్దతు తెలుపుతున్నారు. తిరిగి గులాబీ గూటికి చేరేందుకు సిద్దమవుతున్నట్లు తెలుస్తోంది. తెలంగాణలో వచ్చే అసెంబ్లీ ఎన్నికలే లక్ష్యంగా కొత్త రాజకీయం మొదలైంది. సమీకరణాలు వేగం గా మారుతున్నాయి. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన సమయంలో బీఆర్ఎస్ కు చెందిన ఎమ్మెల్యే లు పలువురు అధికార పార్టీకి దగ్గరయ్యారు. వీరి అనర్హత వేటు వ్యవహారం సుప్రీం వరకు వెళ్లింది. స్పీకర్ వీరి పిటీషన్లు విచారణ చేసి... క్లీన్ చిట్ ఇచ్చారు. కాగా.. తాజాగా మాజీ స్పీకర్.. ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. తన నియోజక వర్గంలో కేసీఆర్ హయాంలోనే అభివృద్ధి జరిగిందని, ఈ విషయం చెప్పడానికి తానేమీ వెనుకాడబోనని అన్నారు. అన్నం పెట్టిన వారిని



మరిచిపోలేమని చెప్పారు. కేసీఆర్‌ను మోసం చేసి పార్టీ మారడం తనకు ఇష్టం లేదని, కానీ.. నియోజకవర్గంలో కొంతమంది వ్యవహార శైలి, తనను పెట్టిన ఇబ్బందులు, మారిన రాజకీయ పరిస్థితుల వల్లే కాంగ్రెస్?తో కలిసి పనిచేయాల్సి వచ్చిందంటూ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు హాట్ టాపిక్ గా మారాయి. కాంగ్రెస్ కు దగ్గరైన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఒక్కొక్కరుగా తిరిగి కేసీఆర్ పైన తమ అభిమానం చాటు కొనే విధంగా వ్యాఖ్యలు చేసారు. ఇక.. తాజాగా కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనంలో పోచారం చేసిన వ్యాఖ్యలు అదే తరహాలో ఉన్నాయి. తాను ఏనాడూ కాంగ్రెస్ కండువా కప్పుకోలేదని, మూడు రంగుల జాతీయ కండువాను కప్పుకున్నానని వివరించారు. మంత్రి పదవి కోసమో, డబ్బుల కోసమో తాను పార్టీ మారలేదని చెప్పుకొచ్చారు. రెండేళ్ల క్రితం మంత్రి పొంగులేటి శ్రీనివ్ష?సరెడ్డి హైదరాబాద్‌లోని తన ఇంటికి వచ్చి.. సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడించారని, తర్వాత ముఖ్యమంత్రి స్వయంగా తన ఇంటికి వచ్చి.. ఆరు నెలల్లో నియోజకవర్గ సమస్యల పరిష్కారానికి నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. కానీ, ముఖ్యమంత్రి హామీ నేటికీ నెరవేరలేదని, సీఎం చెప్పినా మంత్రులు తన ఫోన్ ఎత్తడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రులు ముఖ్యమంత్రి మాట కూడా వినడం లేదన్నారు. పోచారం వ్యాఖ్యల ద్వారా తిరిగి ఆయన గులాబీ గూటికి దగ్గరవుతున్నారనే ప్రచారం మొదలైంది. పోచారం బాటలోనే మరో ఇద్దరు ఎమ్మెల్యేలు ఉన్నారని తెలుస్తోంది. దీంతో.. రానున్న రోజుల్లో చోటు చేసుకునే రాజకీయం పైన ఆసక్తి నెలకొంది.

# అరుణాచలం, నాగపట్నం కు ప్రత్యేక రైళ్లు ..!!

తెలుగు రాష్ట్రాల ప్రయాణీకులకు రైల్వే శాఖ కీలక అప్డేట్ ఇచ్చింది. వేలాంకన్ని లో జరగనున్న ఉత్సవాల వేళ తెలుగు రాష్ట్రాల మీదుగా ప్రత్యేక రైళ్లు ప్రకటించారు. వేలాంకణిలో జరిగే వార్షిక ఉత్సవాలకు ఏపీ, తెలంగాణ నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వెళ్తారు. వీరి కోసం ఉత్సవాల సమయంలో ఈ రైళ్లను ప్రకటించారు. ఈ రైళ్ల రిజర్వేషన్లు ప్రారంభించారు. ఈ స్పెషల్ ట్రైన్స్ వెళ్లే మార్గం.. హాల్టింగ్ స్టేషన్లతో పాటుగా షెడ్యూల్ ను అధికారులు వెల్లడించారు. ఏపీ, తెలంగాణ రైల్వే ప్రయాణీకులకు బిగ్ అప్డేట్. వేలాంకన్ని వార్షికోత్సవాల వేళ దక్షిణ మధ్య రైల్వే చర్లపల్లి నుంచి ప్రత్యేక రైళ్లను ప్రకటించింది. 'బసిలికా ఆఫ్ అవర్ లేడీ ఆఫ్ గుడ్ హెల్త్' చర్చి వార్షిక ఉత్సవాలు ప్రతి సంవత్సరం నిర్వహించటం ఆనవాయితీగా వస్తోంది. ఏటా ఆగస్టు 29 నుంచి సెప్టెంబర్ 8 వరకు అత్యంత వైభవంగా జరిగే ఈ ఉత్సవాల్లో కులమతాలకు అతీతంగా పలు రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలి వస్తారు. దీంతో.. ఈ సమయంలో రద్దీకి అనుగుణంగా రైల్వే అధికారులు ప్రత్యేక రైళ్లను ప్రకటించారు. చర్లపల్లి నుంచి ఈ రైళ్లు నిర్వహించనున్నారు. ట్రైన్ నంబర్ 07127 సెప్టెంబర్ 8 మంగళవారం ఉదయం 7.40 గంట లకు చర్లపల్లిలో బయల్దేరుతుంది. తిరిగి మరుసటి రోజు ఉదయం 9.10గంటలకు వేలంకని చేరుకుంటుంది. అదే విధంగా ట్రైన్ నంబర్ 07128సెప్టెంబర్ 9 బుధవారం వేలాంకని లో రాత్రి 11గంటలకు బయల్దేరుతుంది. మరుసటి రోజు 10.15గంటలకు చర్లపల్లి చేరుకుంటుంది. ఈ రైళ్లు చర్లపల్లి నుంచి బీబీనగర్, నల్లగొండ, మిర్యాలగూడ, నడికుడి, పిడుగురాళ్ల, సత్తెనపల్లి, గుంటూరు, తెనాలి, బాపట్ల, చీరాల, ఒంగోలు, నెల్లూరు, రేణిగుంట, తిరుపతి, చిత్తూరు, కాట్పాడి, తిరువణ్ణామలై, విల్లుపురం, మైలాడుతుర్తై, నాగప్పట్టినం స్టేషన్లలో ఆగుతాయి. ఈ ప్రత్యేక రైళ్లలో 2ఏసీ, 3ఏసీ, స్లీపర్, జనరల్ సెకండ్ క్లాస్ కోచ్‌లు ఉంటాయి. కాగా.. ఆగస్టు 26 నుంచి సెప్టెంబరు 7 వరకు మహారాష్ట్ర నుంచి



నడిపే ప్రత్యేక రైళ్ల జాబితాను ప్రకటించారు. ట్రైన్ నంబర్ 01161 : లోకమాన్య తిలక్ – వేలంకని రైలు ఆగస్టు 26, సెప్టెంబర్ 7న ప్రయాణించనున్నాయి. ఈ రైలు బుధ, సోమ వారాల్లో ఉదయం 11.50 గంటలకు బయల్దేరి శుక్ర, బుధవారాల్లో తెల్లవారుజామున 2గంటలకు వేలంకన్ని చేరుకుంటుంది. అదే విధంగా ట్రైన్ నంబర్ 01162 : వేలంకన్ని – లోకమాన్య తిలక్ మధ్య ప్రత్యేక రైలును ప్రకటించారు.

# ఏపీలో సీట్లు పెరగవు... 2029 లో అంతేనా ?

(మొదటి పేజీ తరువాయి)

బిల్లుకి మద్దతు కరవు అవుతోంది. అంతకంటే ముందు అసలు బిల్లు పార్లమెంట్ లో ప్రవేశపెట్టేందుకు కూడా చాన్స్ లేకుండా పోతోంది అని అంటున్నారు. డీలిమిటేషన్ బిల్లు ఆమోదం పొందితే ఏపీలో పార్లమెంట్ సీట్లతో పాటు అసెంబ్లీ సీట్లు కూడా పెరుగుతాయని అంటున్నారు. అలా అదనంగా కనీసం యాభై నుంచి అరవై అసెంబ్లీ సీట్లు అదనంగా వస్తాయని కూడా భావించారు. అయితే ఇపుడు ఆ పరిస్థితి అన్నది లేకుండా పోతోంది అని అంటున్నారు. నిజానికి రెండు తెలుగు రాష్ట్రాలకు సంబంధించి విభజన బిల్లులో ఉన్న మేరకు సీట్లు పెంచుకోవచ్చు. కానీ డీలిమిటేషన్ బిల్లు ఎటూ ఉంది కాబట్టి కొత్తగా పెంచేది ఎందుకు అన్నది చర్చగా ఉంది. ఇపుడు అదీ లేదు ఇదీ లేదు అని అంటున్నారు. దాంతో 2029 ఎన్నికల్లో చూసుకుంటే ఏపీలో 175 సీట్లకే ఎన్నికలు జరిగే వాతావరణం కనిపిస్తోంది అని అంటున్నారు. అదే జరిగితే కూటమి పార్టీలకు సీట్ల సర్దుబాటు పెద్ద సమస్యగా మారుతుందని అంటున్నారు. అలాగే వైసీపీలో కూడా అనేక మంది ఆశావహులు సీట్ల కోసం చూస్తున్నారు. సీట్లు పెరిగితే వారికి చాన్స్ వస్తుందని అనుకున్నారు. ఇపుడు వారు కూడా ఇబ్బంది పడే స్థితి ఏర్పడుతుందని అంటున్నారు. మొత్తం మీద ఇప్పటికి మూడు ఎన్నికలు పాత సీట్లతోనే జరిగాయి. సీట్లు కనుక పెరగకపోతే రాజకీయంగా కూడా 2029 ఎన్నికల్లో ఇది తీవ్ర ప్రభావం చూపిస్తుంది అని అంటున్నారు. చూడాలి మరి ఏమి జరుగుతుందో.

# ఉచితాలే రాజకీయ మంత్రం.. గెలుపు తర్వాత అదే ప్రజలకు గుదిబండ!

(మొదటి పేజీ తరువాయి)

చిత్రంగా ఆ తర్వాత జరిగిన బీహార్, పశ్చిమ బెంగాల్, ఒడిశా రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో ఇదే కేంద్రంలోని బీజేపీ పార్టీ ఉచిత పథకాలకు తెరదీసింది. ఏకంగా విద్యార్థులకు స్కూటీలు, ఉచిత ఫీజులు, రీయింబర్సు మెంట్లు అంటూ ఊదరగొట్టి.. ఆయారాష్ట్రాలలో అధికారం దక్కించుకుంది. ఇక, ఓటుకు-ఉచితాలకు మధ్య బంధం పేగుబంధంగా మారిందన్నది వాస్తవం. ఎన్నికలకు ముందే ఉచితాలు ప్రకటిస్తున్న పార్టీలు పెరుగుతున్నాయి. ఇక, ఎన్నికల సమయంలో ఒక పార్టీకి మించి మరో పార్టీ ఉచితాలపై గొప్పలు పోతున్నాయి. ఇటీవలే తమిళనాడులో ఉచిత తాళిబొట్ల పంపిణీ కోసం 800 కోట్ల రూపాయలను ప్రభుత్వం కేటాయించింది. నిజానికి పాఠశాల విద్యకు కేటాయించాల్సిన 500 కోట్లలో సగం కోత పెట్టి.. దీనికి కేటాయించడం గమనార్హం. అలానే ఉచిత ల్యాప్ టాప్ పథకానికి ఏకంగా 2 వేల కోట్లను కుమ్మరించింది. సో.. ఇవన్నీ ఎన్నికల హామీలే. న్యాయవ్యవస్థకు ఏం తెలుసు.. తమ కష్టాలు అంటూ.. రాజకీయ నేతలు ఉసూరు మంటున్నారు. అధికారంలోకి వచ్చేందుకు ఉచితాలు పనిచేస్తున్నా.. వచ్చిన తర్వాత చుక్కలు చూపిస్తున్నాయనడానికి రెండు తెలుగు రాష్ట్రాలూ.. మినహాయింపు కాకపోవడం గమనార్హం.

# శ్రావణం ప్రారంభం చేయాల్సిన నియమాలు..!!

(మొదటి పేజీ తరువాయి)

కానుంది. ఆగస్టు 13 నుంచి సెప్టెంబరు 11 వరకు ఈ మాసం కొనసాగుతుంది. కాగా.. ఆగస్టు 15, 16, 21, 22, 23, 26, 27, 28, 30 తేదీలతో పాటు సెప్టెంబరు 3, 4, 5 తేదీల్లో కూడా వివాహ ముహూర్తాలు ఉన్నట్లు పండితులు చెబుతున్నారు. కాగా.. శ్రావణ మాసం ముగిసిన తర్వాత భాద్రపదం శూన్యమాసంగా రావడం, అనంతరం ఆశ్వీయుజ మాసంలో శుక్ర మౌఢ్యం ఉండటంతో కొంతకాలం వివాహ ముహూర్తాలు అందుబాటులో ఉండవని చెబుతున్నారు. కాగా, అక్టోబరు 29 వరకు శుభకార్యాలకు ముహూర్తాలు లేవు. దీంతో, శ్రావణంలోనే నిర్వహించేలా పలువురు ఆసక్తి చూపుతున్నారు. శ్రావణ మంగళవారం, శుక్రవారం నాడు గౌరీ దేవిని, వరలక్ష్మీ దేవిని ఆరాధిస్తారు. శ్రావణమాసంలో వచ్చే వరలక్ష్మీ వ్రతం చాలా విశేషమైనది. ఆ రోజు గణపతి పూజ చేసి, వరలక్ష్మీ దేవిని ఆరాధించి, వ్రత కథ చదువుకుని, ముత్తయిదువులకు తాంబూలం ఇవ్వడం వలన మంచి ఫలితం ఉంటుంది. ఈ సారి వరలక్ష్మీ వ్రతం ఎప్పుడు చేసుకోవాలనే సందేహాలు వ్యక్తం అయ్యాయి. ఆగస్టు 21న వరలక్ష్మీ వ్రతం చేసుకోవాలని పండితులు ఇప్పటికే ముహూర్తంగా నిర్ణయించారు.ఈ నెలలో దాదాపు 5 వేలకు పైగా పెళ్లిళ్లు జరుగుతాయని విశ్లేషకుల అంచనా. అంతేగాకుండా రాఖీ పౌర్ణమి ప్రత్యేకంగా జరుపుకుంటారు.



# కొత్త పెన్షన్లు వీరికే..

తెలంగాణ , ఆగస్టు 13: తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. కొత్త పెన్షన్ల పైన ప్రభుత్వం కార్యాచరణ ఖరారు చేసింది. కొత్త పెన్షన్ల మంజూరుకు సంబంధించి విధి విధానాలు నిర్ధారించిన ప్రభుత్వం.. పంపిణీ పైన మార్గదర్శకాలు వెల్లడించింది. దీనికి సంబంధించిన గడువు పొడిగించింది. అర్హతల పైనా స్పష్టత ఇచ్చిన ప్రభుత్వం.. ఎవరు పెన్షన్లకు అర్హులు కాదనేది తేల్చి చెప్పింది. క్షేత్ర స్థాయి నుంచి ఈ మొత్తం ఉన్నతాధికారులు పర్యవేక్షించనున్నారు. తెలంగాణలో ప్రభుత్వం ఈ నెల 15వ తేదీ నుంచి అర్హత ఉన్న వారికి కొత్త పెన్షన్లు మంజూరు చేయాలని డిసైడ్ అయింది. తొలి దశలో వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, గీత కార్మికులు, చేనేత కార్మికులతో పాటు ఫైలేరియా, తలసేమియా, సికిల్ సెల్, హీమోఫీలియా వంటి వ్యాధులతో బాధపడుతున్న బాధితులకు కొత్త పింఛన్లు మంజూరు చేయనున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మూడు లక్షల నుంచి 3.5లక్షల మందికి విడతల వారిగా కొత్తగా పింఛన్లు మంజూరు చేయాలని సర్కార్ నిర్ణయించింది. ఇందులో మహిళలకు, దివ్యాంగులకు అనారోగ్యంతో ఉన్నవారికి అధిక ప్రాధాన్యం ఇస్తోంది. దరఖాస్తుల తుదిగడువు ఆగస్టు 31 వరకు పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వం తాజా నిర్ణయంతో కాగా.. దివ్యాంగులకు రూ.4,016 ఇతరులకు రూ.2,016 ఇవ్వనున్నట్లు మార్గదర్శకాల్లో సర్కార్ పేర్కొంది. కొత్త పింఛన్లకు సంబంధించిన దరఖాస్తు ఫారం చేయూత పోర్టల్ లో అందుబాటులో ఉంటుంది. కొత్త పింఛన్ కోసం దరఖాస్తు చేసుకుంటున్న వారు.. పూర్తి చేసిన దరఖాస్తు ఫారం, ఆధార్ కార్డు, వయస్సు ధ్రువీకరణ పత్రం, రేషన్ కార్డు/ఆహార భద్రత కార్డు లేదంటే రెవెన్యూ శాఖ జారీ చేసిన ఆదాయ ధ్రువీకరణ పత్రం, బ్యాంకు పాస్ పుస్తకం మొదటి పేజీ పమర్పించాలి. కేటగిరీని బట్టి అదనపు పత్రాలు ఇవ్వాల్సి ఉంటుంది. మూడెకరాలకు మించి నీటి పారుదల భూమి లేదంటే 7.5ఎకరాలకు మించి పొడి భూమి ఉన్న వారిని అనర్హులుగా గుర్తించింది. అదే విధంగా ప్రభుత్వ, ప్రభుత్వ రంగ సంస్థలు, ప్రైవేటు సంస్థలు, ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగాలు చేస్తున్న వారి కుటుంబ సభ్యులు అనర్హులుగా పేర్కొంది.

# వేదవ్యాస జయంతిని అధికారికంగా నిర్వహించాలి మంత్రి కొల్లు రవీంద్రను కోరిన జశ్వంత్ వ్యాస్

అనంతపురం, ఆగస్టు 12 అనంత సూర్య : వేదవ్యాస మహర్షి జయంతిని అధికారికంగా నిర్వహించి సెలవు దినంగా ప్రకటించాలని, అలాగే రాష్ట్రంలోని పలు నగరాలు, పట్టణాలు, మండలాల్లో వేదవ్యాస మహర్షి విగ్రహాలు ఏర్పాటు చేయాలని మత్స్యకార సంక్షేమ సమితి అనంతపురం జిల్లా అధ్యక్షులు జశ్వంత్ వ్యాస్ ప్రభుత్వాన్ని కోరారు. అమరావతిలోని సచివాలయంలో బుధవారం మంత్రి కొల్లు రవీంద్రను మర్యాద పూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు. అంతకుముందు మంత్రిని శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా జశ్వంత్ వ్యాస్ మాట్లాడుతూ.. భారతీయ సంస్కృతి, వేద సంప్రదాయాలకు ఆద్యుడైన మహర్షి వేదవ్యాసుడు ప్రపంచానికి మహాభారతం, భాగవతం, వేదాలు వంటి మహోన్నత గ్రంథాలను అందించిన మహనీయుడు అని, భారతీయ ఆధ్యాత్మికత, ధర్మ పరిరక్షణలో ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో పలు నగరాలలో , మండలాలలో మహర్షి వేదవ్యాసుల వారి భవ్య విగ్రహాన్ని ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా ప్రతి సంవత్సరం జరిగే వ్యాస జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించి, ఆ రోజు ప్రభుత్వ సెలవు దినంగా ప్రకటించాలని కోరారు. తద్వారా భారతీయ సంస్కృతి, వేద పరంపర పట్ల యువతలో



అవగాహన పెంపొందడమే కాకుండా, మహర్షి వ్యాసుల గొప్పతనం తరతరాలకు చేరుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ విషయంపై స్పందించాలని మంత్రికి విన్నవించారు. దీనిపై మంత్రి కొల్లు రవీంద్ర సానుకూలంగా స్పందించారు. నూతనంగా మత్స్యకార జిల్లా అధ్యక్షులుగా ఎంపిక పట్ల జశ్వంత్ వ్యాస్‌ని అభినందించి మత్స్యకారుల సంక్షేమం కోసం కృషి చేయాలని సూచించారు.

## నేషనల్ మిన్స్ మెరిట్ ఫలితాలలో ప్రతిభ కనబరిచిన నెంబర్ 2 పాఠశాల విద్యార్థి..



అనంత సూర్య, 12: అనంతపురం: స్థానిక నెం2 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న పి లోక సాయి అనే విద్యార్థి బుధవారం ప్రకటించిన నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్షిప్ కి ఎంపిక కావడం పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎస్ నవీద మరియు పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తున్నారు. అంతేకాక లోక సాయి అనే విద్యార్థి ఎటీఎల్ ల్యాబ్ లో గల వివిధ పరికరాల సహాయంతో తరచుగా వివిధ వినూత్న పరిశోధనలు చేస్తూ విజ్ఞాన శాస్త్ర ఉపాధ్యాయులనే అబ్బురపరుస్తూ తన సృజనాత్మకతకు మరియు తాను కనుగొన్న ప్రాజెక్టులను యంగ్ సైంటిస్ట్ అనే తన యూట్యూబ్ ఛానల్ ద్వారా ఎంతో మంది చేత అభినందించబడుతుంటారు. ఈమధ్య కాలంలోనే తాను తయారుచేసిన సెన్సార్ ని ఉపయోగించి ఏకకాలంలో కొన్ని సెకన్లలోనే విద్యార్థుల బరువు మరియు ఎత్తును తెలుసుకునేటట్లు ఒక పరికరాన్ని తయారు చేసి అందరిని ఆశ్చర్యచకితులను చేశారు.

## రహదారి ప్రమాదాల నివారణకు ప్రణాళిక సిద్ధం

- అనంతపురం జిల్లా ఎస్పీ జగదీష్

అనంత సూర్య, రాప్తాడు : మండల పరిధిలో ఉన్న 44వ జాతీయ రహదారి



పరిసరాలలో రహదారి ప్రమాదాల నివారణకు పక్కా ప్రణాళిక సిద్ధం చేయాలని అనంతపురం జిల్లా ఎస్పీ జగదీష్ రాప్తాడు సి.వెంకటేశులును ఆదేశించారు. బుధవారం రాప్తాడు పోలీస్ స్టేషన్ ను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీసు స్టేషన్ ఆవరణతో పాటు చుట్టుపక్కల పరిసరాలను నిరంతరం పరిశుభ్రంగా ఉంచుకోవాలని సిబ్బందికి స్పష్టం చేశారు. మండల పరిధిలో వరుసగా జరుగుతున్న రహదారి ప్రమాదాలను అరికట్టేందుకు సంబంధిత ప్రభుత్వ శాఖలతో సంప్రదించి ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని, ప్రమాదాలు జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామాలలో నిరంతరం పర్యటిస్తూ అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా గట్టి నిఘా ఉంచాలని సూచించారు. స్టేషన్ ప్రాంగణంలో ఉన్న వాహన యజమానులను పిలిపించి పరిశీలన అనంతరం నిలిచిపోయిన వాహనాలను వేగంగా అప్పగించాలని తెలిపారు. జిల్లా ఎస్పీ జారీ చేసిన సూచనల మేరకు ప్రత్యేక దృష్టి సారించి శాంతిభద్రతల పరిరక్షణకు, ప్రమాదాల నివారణకు ముందుకెళ్తామని రాప్తాడు సీఐ వెంకటేశులు తెలిపారు. సిఐ వెంట పోలీస్ స్టేషన్ ఎస్సై షేక్షావలి సిబ్బంది ఉన్నారు.

# అమెరికాకు వెళ్లినా వ్యవసాయంపై తగ్గని మక్కువ

## క్యాలిఫోర్నియాలో పంటలను పరిశీలించిన ఎమ్మెల్యే పరిటాల సునీత

అనంత సూర్య, 12: అనంతపురం: నిత్యం ప్రజాక్షేత్రంలో ఉంటూ అభివృద్ధి, రాజకీయ కార్యక్రమాలతో బిజీ బిజీగా కనిపించే రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీతకు వ్యవసాయంపై తనకున్న మక్కువ ఏమాత్రం తగ్గలేదు. తరచూ తన వ్యవసాయక్షేత్రాన్ని సందర్శిస్తూ అక్కడే సమయం గడపటం, అలాగే రైతుల పొలాలను పరిశీలించడం వంటివి చేస్తుంటారు. అయితే తన వ్యక్తిగత పర్యటనలో భాగంగా అమెరికా వెళ్లిన ఆమె అక్కడ కూడా వ్యవసాయం పై ఆసక్తి చూపించారు. అక్కడ పంటలు ఎలా సాగుచేస్తున్నారో తెలుసుకోవాలన్న ఆసక్తితో క్యాలిఫోర్నియాలో పంట పొలాలను పరిశీలించారు. అక్కడి వ్యవసాయ విధానాలను, అలాగే పంటల ఉత్పత్తులు, మార్కెటింగ్ వంటి అంశాలను స్థానికంగా



ఉన్న రైతులను అడిగి తెలుసుకున్నారు. భారత దేశంలో ఎమర్జెన్సీ ప్రకటించిన సమయంలో పంజాబ్ రాష్ట్రం నుంచి వలస వెళ్లిన సిక్కులు క్యాలిఫోర్నియాలో స్థిరపడగా.. ప్రస్తుతం ఓ సిక్కు రైతు 175 ఎకరాలలో ఆల్మండ్ (బాదం) పంట వేశారు. ఈ పంటను ఎమ్మెల్యే సునీత పరిశీలించారు. పంట ఎలా సాగు చేస్తున్నారన్న వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం ఈ పంట సాగు చేసి 8 సంవత్సరాలైందని.. ఒక ఎకరానికి 150 మొక్కలు నాటుతారని.. ఒక ఎకరానికి 1.6 టన్నుల దిగుబడి వస్తుందని వివరించారు. 100 ఎకరాల నుంచి 3వేల ఎకరాల దాకా ఒక్కో రైతు అక్కడ పంటలు సాగు చేస్తున్నట్లు తెలిపారు. పంటల నిర్వహణ విధానాన్ని తెలుసుకోవడంతో పాటు పంట కోత (హార్వెస్టింగ్) విధానాన్ని కూడా తెలుసుకున్నారు. మొత్తం యంత్రాల ద్వారానే హార్వెస్టింగ్ నిర్వహిస్తారని రైతులు వివరించారు. అమెరికాలో వ్యవసాయ విధానాలు చాలా సాంకేతికంగా ఉన్నాయని.. మార్కెటింగ్ లో కూడా మనం తెలుసుకోవాల్సినవి చాలా ఉన్నాయని ఎమ్మెల్యే సునీత తన అభిప్రాయాలను పంచుకున్నారు.

## మద్యం సేవించి వాహనాలు నడిపిన వారికి జరిమానా

చిత్తూరు,ఆగస్టు 12(అనంత సూర్య: మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన ఐదుగురికి చిత్తూరు 1వ స్పెషల్ జ్యుడీషియల్ 2వ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున మొత్తం రూ.50 వేల జరిమానా విధించింది.జిల్లా ఎస్పీ తుషార్ డూడి ఆదేశాల మేరకు చిత్తూరు ఎస్‌డీపీఓ జె. వెంకట నారాయణ ఆధ్వర్యంలో చిత్తూరు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శ్రీ జి. నిత్యబాబు వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న ఐదుగురు పట్టుబడ్డారు. వీరిని బుధవారం చిత్తూరు 1వ స్పెషల్ జ్యుడీషియల్ 2వ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరచగా, న్యాయమూర్తి కె. పరిమళ దేవి ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున మొత్తం రూ.50 వేల జరిమానా విధించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నిత్యబాబు మాట్లాడుతూ, మద్యం సేవించి వాహనం నడపడం అత్యంత ప్రమాదకరమని, దీనివల్ల వాహనదారుల ప్రాణాలతో పాటు రహదారిపై ప్రయాణించే ఇతరుల ప్రాణాలకు కూడా ముప్పు ఏర్పడుతుందని తెలిపారు. రోడ్డు భద్రతా నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని సూచించారు.మద్యం సేవించి వాహనం నడిపినట్లు తేలితే మోటారు వాహనాల చట్టంలోని సెక్షన్ 185 ప్రకారం జరిమానా, జైలు శిక్ష లేదా రెండూ విధించే అవకాశం ఉందని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై పోలీసులు నిరంతరం తనిఖీలు నిర్వహిస్తూ చట్టపరమైన చర్యలు తీసుకుంటారని హెచ్చరించారు. వాహనదారులు మద్యం సేవించి వాహనం నడపకుండా, ట్రాఫిక్ మరియు రోడ్డు భద్రతా నిబంధనలు పాటించి ప్రమాదాలకు, జరిమానాలకు, శిక్షలకు దూరంగా ఉండాలని ట్రాఫిక్ పోలీసులు సూచించారు.


# బాలాజీ కాలేజ్ ఆఫ్ ఫార్మసీకి పదేళ్ల అటానమస్ హోదా




అనంతపురం, ఆగస్టు 12 అనంత సూర్య : అనంతపురంలోని బాలాజీ కాలేజ్ ఆఫ్ ఫార్మసీకి 2026-27 విద్యా సంవత్సరం నుంచి 10 సంవత్సరాల పాటు అటానమస్ హోదా లభించింది. కళాశాల విద్యా ప్రమాణాలు, అకడమిక్ పనితీరు, మౌలిక వసతులు, ప్రయోగశాలలు, అధ్యాపకుల అర్హతలు, పరిశోధన మరియు విద్యార్థుల అభివృద్ధి వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని ఈ ప్రతిష్టాత్మక హోదా మంజూరైంది. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ డాక్టర్ కిషోర్ పల్లె మాట్లాడుతూ.. అటానమస్ హోదా లభించడం బాలాజీ కాలేజ్ ఆఫ్ ఫార్మసీ విద్యా ప్రస్థానంలో ఒక ముఖ్యమైన మైలురాయన్నారు. విద్యార్థులకు నాణ్యమైన, ఆధునిక మరియు పరిశ్రమ అవసరాలకు అనుగుణమైన ఫార్మసీ విద్యను అందించేందుకు మరింత కృషి చేస్తామని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రదీప్ కుమార్ మాట్లాడుతూ.. అటానమస్ హోదాతో విద్యా విధానాలను మరింత ఆధునీకరించడంతో పాటు విద్యార్థుల్లో ప్రాక్టికల్ నాలెడ్జ్, పరిశోధనా దృక్పథం, నైపుణ్యాలను పెంపొందించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రాజ వర్ధన్ మాట్లాడుతూ.. విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా కరికులమ్‌ను అభివృద్ధి చేసుకోవడంతో పాటు ఇండస్ట్రీ ఇంటరాక్షన్, ఇంటర్న్‌షిప్‌లు, పరిశోధన, నైపుణ్యాభివృద్ధికి మరింత ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. యాజమాన్య ప్రతినిధి కే.శ్రీకాంత్ రెడ్డి, స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీనివాసులురెడ్డి, డీన్ డాక్టర్ సంతోష్ రెడ్డి మాట్లాడుతూ.. ఈ హోదా కళాశాలపై మరింత బాధ్యతను పెంచిందని, విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ప్లేస్మెంట్ ఆఫీసర్ జీటీ రుద్ర, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఎనఎంఎంఎస్ ఫలితాల్లో నూతిమడుగు విద్యార్థుల విజయదుందుభి

### ఐదు మంది జెడ్పీహెచఎస్ విద్యార్థుల ఎంపిక



రిషిక్ ధావన్ | నిహాస్ యాదవ్ | నిహారిక

అనంతపురం, ఆగస్టు 12 అనంత సూర్య : ఇటీవల జాతీయ స్థాయిలో నిర్వహించిన నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్షిప్ (ఎనఎంఎంఎస్) పరీక్షలో నూతిమడుగు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి ఐదు మంది విద్యార్థులు ఎంపికై రికార్డు సృష్టించారు. కంబదూరు మండలంలో ఆరు మంది విద్యార్థులు ఎంపికవగా, ఒక్క నూతిమడుగు ఉన్నత పాఠశాల విద్యార్థులే ఐదు మంది ఎంపిక కావడం నూతిమడుగు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలకే కాకుండా మండలానికే గర్వకారణమని మండల విద్యాశాఖ అధికారులు ఉమాపతి, మదన్ మోహన్, నూతిమడుగు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజశేఖరరెడ్డి, ఉపాధ్యాయ బృందం, గ్రామస్తులు కొనియాడారు. ఈ ప్రతిభా స్కాలర్షిప్‌కి ఎంపికైన విద్యార్థులకు ప్రతి సంవత్సరం 12 వేల రూపాయలు చొప్పున నాలుగేళ్లపాటు వస్తుందని ప్రధానోపాధ్యాయులు తెలియజేశారు. ఎనఎంఎంఎస్‌కి ఎంపికైన విద్యార్థులు అశ్విత్ కుమార్, దాసరి నిహాస్ యాదవ్, ఋషిక్ ధవన్, నిహారిక, జాహ్నవిలను మండల విద్యాశాఖ అధికారులు ఉమాపతి, మదన్‌మోహన్, ఉపాధ్యాయ బృందం, గ్రామ ప్రజలు అభినందించారు.

# అనంత అర్బన్‌లో వైసీపీకి బిగ్ షాక్ !

## 48 డివిజన్‌లో వైసీపీ ఖాళీ - ఆక్రమణలు, అవమానంతోనే..- వైసీపీ డివిజన్ అధ్యక్షులు సంగాల సురేష్


*అనంతపురం, ఆగస్టు 12 అనంత సూర్య :*

అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో వైసీపీకి భారీగా షాక్ తగిలింది. 48వ డివిజన్‌లో మాజీ కార్పొరేటర్ వ్యవహార శైలి వల్ల తామంతా వైసీపీని వీడాల్సి వచ్చిందని, తెలుగుదేశం పార్టీతోనే అభివృద్ధి జరుగుతోందని భావించి టీడీపీలోకి చేరుతున్నామని వైసీపీ డివిజన్ అధ్యక్షులు సంఘాల సురేష్ తెలిపారు. సంఘాల సురేష్‌తోపాటు వైసీపీ సోషల్ మీడియా వింగ్ ప్రధాన కార్యదర్శి ఇంద్రసేనారెడ్డితో పాటు పలువురు వైసీపీ నాయకులు పార్టీకి రాజీనామా చేస్తూ.. వారు మాజీ కార్పొరేటర్ శ్రీనివాసులుపై తీవ్రస్థాయిలో ఆరోపణలు చేశారు. 48వ డివిజన్‌లో ఆయన వ్యవహరించిన తీరుతో ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఏర్పడిందని, అక్రమ వసూళ్లు, రేషన్ షాపుల వ్యవహారాల్లో అక్రమాలు, స్థల ఆక్రమణలు, మరువంక పూడికతీత పనుల్లో అక్రమ వాటాలు వంటి అనేక అంశాలపై తమ వద్ద ఆధారాలు ఉన్నాయని వారు పేర్కొన్నారు. అనంతపురం నగరంలో ఎప్పుడెప్పుడు వర్షాలు పడతాయా.. రజక నగర్ కాలనీ ఎప్పుడెప్పుడు మునుగుతుందా.. సేవ చేసినట్టు నటించి అక్రమ బిల్లులు చేయించుకొని వాటాలు పంచుకుందాం.. అని ప్రయత్నించే వ్యక్తి శ్రీనివాసులు అన్నారు. అలాగే ఆర్కే నగర్‌లోని రోడ్డు విషయంలో అధికారులు రోడ్డు వేసేందుకు అన్ని ప్రణాళికలు సిద్ధం చేస్తే వేయకుండా అడ్డుపడి అక్కడ అక్రమ వసూలు చేసింది నిజం కాదా.. ఇంద్రానగర్ ప్రభుత్వ పాఠశాలకు పెయింటింగ్ చేస్తున్న ఒక పెయింటర్‌ని మామూలు ఇవ్వకుంటే నీ పెయింటింగ్ పనులు ఆపేస్తా.. అని బెదిరించడం నిజం కాదా ! ఒక స్థలం విషయంలో రూ.40 లక్షలు నువ్వు తిన్నది నిజం కదా.. ఇలా చెప్పుకుంటూ పోతే చాలా ఉన్నాయని, ఇవన్నీ పక్కా ఆధారాలతో నిరూపించడానికి రెడీగా ఉన్నామని పేర్కొన్నారు.

'మేము ఉత్తుత్తి ఆరోపణలు చేసే రకం కాదు. మేము చేసిన ప్రతి ఆరోపణకు మా వద్ద పక్కా ఆధారాలు ఉన్నాయి. అవసరమైతే వాటిని బయటపెట్టి నిరూపించడానికి సిద్ధంగా ఉన్నాం' అంటూ వారు ఘాటుగా స్పందించారు. అలాగే రజకనగర్ కాలనీ ముంపు సమస్య, ఆర్కే నగర్ రోడ్డు సమస్య, ఇంద్రానగర్ ప్రభుత్వ పాఠశాల పెయింటింగ్ పనులకు సంబంధించిన వ్యవహారాల్లో కూడా శ్రీనివాసులుపై వారు పలు ఆరోపణలు చేశారు. వీటిపై కూడా ఆధారాలతో మాట్లాడేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ముఖ్యంగా 30 ఏళ్లుగా పరిష్కారం కాని, మరువంక సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు, ఆర్కే నగర్‌లో రోడ్డు సమస్యను పరిష్కరించేందుకు టీడీపీ ప్రభుత్వం, నాయకులు చర్యలు చేపడుతున్న సమయంలో అభివృద్ధికి అడ్డుపడే రాజకీయాలు చేయడం తమకు ఇష్టం లేదని వారు స్పష్టం చేశారు.

'ప్రజల అభివృద్ధిలో మేము కూడా భాగస్వాములం కావాలనుకుంటున్నాం. ప్రజలకు ఉపయోగపడే పనులను అడ్డుకోవడం కాదు.. అభివృద్ధికి సహకరించడమే మా లక్ష్యం" అని వారు పేర్కొన్నారు.






## పెనుకొండ తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ ఏ.శ్యామ్ ప్రసాద్



కనేకల్, ఆగస్టు12:( అనంత సూర్య) : కనేకల్ మండల్ మల్యాం గ్రామంలో చీఫ్ విప్ కాలువ శ్రీనివాసులు ఆదేశాలు మేరకు మన మండల కన్వీనర్ వన్నారెడ్డి ఆదేశాల మేరకు ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం నిర్వహించడం జరిగింది. పెన్షన్ లు తల్లికి వందనం. గ్యాస్ సిలెండర్ల. అన్నదాత -సుఖీభవ. గురించి తెలుసు కోవడం జరిగింది. అందరు కూడా పతకాలు అందినయి అని చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమం శ్రీశీ కూటమి నాయకులు. శరబనాగౌడ్. ప్రభాకర్. కృష్ణరెడ్డి. వంద్ర. పూజారి బసవరాజు. చిన్న మాబు. మరెన్న. యల్లప్ప. వన్నూరుస్వామి. శంకర్ నాయకులు పాల్గొవడం జరిగింది.

## హెడ్ కానిస్టేబుల్ పై యువకుల దౌర్జన్యం
### పిడిబాకుతో చంపుతానని బెదిరించిన యువకుడు



శ్రీకాళహస్తి : ఆగస్టు 12 (అనంత సూర్య) : శ్రీకాళహస్తి రైల్వే స్టేషన్లో సెల్ ఫోన్ దొంగతనం పై విచారణకు వెళ్తున్న హెడ్ కానిస్టేబుల్ పై ఇద్దరు యువకులు దౌర్జన్యం చేసిన ఘటన వెలుగులోకి వచ్చింది. హెడ్ కానిస్టేబుల్ చూస్తుండగానే దారిలో 2 బైకులు ఢీకొనడంతో క్షతగాత్రులను ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఇంతలో వాహనాల తాళాలు తీసుకుని స్టేషన్ కు రావాలని హెడ్ కానిస్టేబుల్ సూచించగా ఆ యువకులు దౌర్జన్యానికి దిగారు. వందలమంది ప్రజలు చూస్తుండగానే యువకులు కత్తి చూపించి చంపుతామంటూ బెదిరించారు. ఎట్టకేలకు యువకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పట్టపగలు ప్రజలు చూస్తుండగానే నడిరోడ్డుపై పోలీసులకే కత్తులు చూపించి దౌర్జన్యానికి దిగుతున్న రౌడీయువకులు అమాయక ప్రజలు, ఒంటరిగా వెళ్తున్న అమ్మాయిలతో ఏ విదంగా ప్రవర్తిస్తారో పోలీసు ఉన్నతాధికారులు ఆలోచించాలని స్థానికులు చెప్పుకుంటున్నారు. ఏదైమైనా శ్రీకాళహస్తి లో రౌడీ మూకలను అరికట్టేందుకు పోలీసులు మరింత దూకుడు పెంచాలని లేనిపక్షంలో సామాన్యులకు రక్షణ లేకుండా పోతుందని అభిప్రాయం వ్యక్తం చేశారు.

## పుట్టపర్తిలో రేపు 'హర్ ఘర్ తిరంగా' భారీ ర్యాలీ
### జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్




పుట్టపర్తి,ఆగస్టు,12:( అనంత సూర్య) 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో భాగంగా రేపు గురువారం పుట్టపర్తి పురపాలక సంఘం (మున్సిపల్) కార్యాలయం నుండి బస్టాండ్ వరకు భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ... జాతీయ ఐక్యతను, దేశభక్తిని చాటిచెప్పేలా ఈ ర్యాలీ సాగుతుందన్నారు. పుట్టపర్తి ప్రజలు, ప్రజాప్రతినిధులు, యువకులు మరియు స్వచ్ఛంద సంస్థలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.రేపు ఉదయం 9:30 గంటలకు మున్సిపల్ ఆఫీస్ నుండి ఆర్టీసీ బస్టాండ్ వరకు ర్యాలీ ఉండును.

## శ్రీ చౌడేశ్వరి దేవి జయంతి సందర్భంగా ఘనంగా అన్నదానం



ఆమడగూరు : ఆమడగూరు మండల కేంద్రంలోని ప్రసిద్ధ శ్రీ చౌడేశ్వరి అమ్మవారి ఆలయంలో బుధవారం జయంతి వేడుకలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త పొట్ట పురుషోత్తమరెడ్డి, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అమ్మవారిని కర్ణాటక నుంచి తెప్పించిన వివిధ రకాల పుష్పాలతో సుందరంగా అలంకరించి, వెండి కవచాన్ని అలంకరించారు. అనంతరం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు శ్రీనివాసరెడ్డి, సురేందర్‌రెడ్డి, భయ్యారెడ్డి, పొట్ట ఉమారెడ్డి, ఆదినారాయణ, వైద్యుడు లక్ష్మీనారాయణ, పూజారులు, చౌడేశ్వరి విద్యాసంస్థల నిర్వాహకులు, భక్తులు, ప్రజలు పాల్గొన్నారు.

## ల్యాప్‌టాప్‌లు, సెల్‌ఫోన్లు చోరీ చేసిన ఇద్దరు అరెస్ట్



అనంతపురం జిల్లా ఎస్పీ శ్రీ పి. జగదీష్, ఐపీఎస్ ఆదేశాల మేరకు, అనంతపురం అర్బన్ ఎస్‌డీపీఓ శ్రీ ఎం. చంద్రశేఖర్ పర్యవేక్షణలో అనంతపురం మూడో పట్టణ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ శ్రీ జి. కౌలుట్లయ్య ఆధ్వర్యంలో పోలీసులు చోరీ కేసును ఛేదించారు. ల్యాప్‌టాప్‌లు, సెల్‌ఫోన్లు చోరీ చేసిన ఇద్దరు నిందితులను 12.08.2026న అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి సుమారు రూ.2 లక్షల విలువైన రెండు ల్యాప్‌టాప్‌లు, మూడు సెల్‌ఫోన్లు, రెండు హార్డ్‌డిస్క్‌లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితులను ఎస్‌జేఎఫ్‌సీఎం మొబైల్ కోర్టు ముందు హాజరుపరచగా, న్యాయస్థానం రిమాండ్‌కు తరలించింది.

## అనంతపురంలో దారుణం..
### భార్యను హత్య చేసిన భర్త



అనంతపురం: నగరంలోని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎల్లమ్మ కాలనీలో దారుణ ఘటన చోటుచేసుకుంది. భార్య బండారు శాంతిని భర్త కురబ మహేష్ రోకలి బండతో కొట్టి హత్య చేసినట్లు సమాచారం. మృతురాలు గుంటూరు జిల్లాకు చెందిన వ్యక్తిగా తెలుస్తోంది. వీరిద్దరూ జూలై 5న శ్రీశైలంలో వివాహం చేసుకున్నట్లు సమాచారం. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు పోలీసుల దర్యాప్తులో తెలియాల్సి ఉంది.

## జగన్ రెడ్డి పులివెందులను..
# ఫ్యాక్షన్ ప్రాంతంగా మార్చాడు

- మేం పులివెందులకు పరిశ్రమలు, సాగునీరు తీసుకొచ్చాం
- ఇంటింటికీ కూటమి ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే దగ్గుపాటి
- 31వ డివిజన్‌లో ఎమ్మెల్యే దగ్గుపాటికి అనూహ్య స్పందన
- రెండేళ్లలో రూ.1296కోట్ల అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేశామన్న దగ్గుపాటి

**అనంతపురం, ఆగస్టు 12 అనంత సూర్య :**

రెండు తరాలుగా పులివెందులను జగన్ రెడ్డి కుటుంబం ఫ్యాక్షన్ ప్రాంతంగా చేస్తే మేము ఈ రెండేళ్లలో పరిశ్రమలు, సాగునీరు తీసుకొచ్చి అభివృద్ధి చేస్తున్నామని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. 31వ డివిజన్‌లో జరిగిన ఇంటింటికీ కూటమి ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. విద్యుత్ నగర్ సర్కిల్ లోని పవిత్ర హైపర్ మార్ట్ వద్ద ఎమ్మెల్యే దగ్గుపాటికి పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన కూటమి నాయకులతో ఇంటింటికీ వెళ్తూ రెండేళ్లలో జరిగిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని ఆరా తీస్తూ.. నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనుల గురించి ప్రజల అభిప్రాయాన్ని తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి రెండేళ్ల పాలన పై ప్రజలు ఎంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. 2014-19మధ్య కాలంలో విభజిత ఆంధ్రప్రదేశ్ ఎన్నో కష్టాల్లో ఉన్నప్పటికీ ముఖ్యమంత్రి చంద్రబాబు అమరావతితో సహా అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేశారన్నారు. అయితే ఆ తర్వాత జగన్ రెడ్డి ఒక్కఛాన్స్ అంటూ అధికారంలోకి వచ్చి ఐదేళ్లలో రాష్ట్రాన్ని 20ఏళ్లు వెనక్కు నెట్టారన్నారు. అయితే మళ్లీ చంద్రబాబు ముఖ్యమంత్రిగా వచ్చిన తర్వాత కొన్ని రోజులకే రాష్ట్రాన్ని గాడిలో పెట్టారన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే సూపర్ సిక్స్ హామీలను నెరవేర్చారన్నారు. 16347ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేస్తూ మెగా డీఎస్సీ, అన్న క్యాంటీన్ల పునఃప్రారంభం, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు, పింఛన్లు పెంపు, యువతకు నైపుణ్యాలు పెంచే విధంగా చర్యలు, ఉచిత గ్యాస్ సిలిండర్లు, అన్నదాత సుఖీభవా, చేనేతలకు ఉచిత విద్యుత్, ఆటో డ్రైవర్లకు ఆర్థిక సాయం వంటి ఎన్నో కార్యక్రమాలు చేశారన్నారు. దీంతో రాష్ట్రానికి సీబీఎన్ అనే బ్రాండ్‌తో మంత్రి నారా లోకేష్ 25లక్షల కోట్ల పెట్టుబడులు తీసుకొచ్చారన్నారు. ఒక్క రాయలసీమ ప్రాంతానికే లక్ష కోట్ల పెట్టుబడులు తీసుకొచ్చారన్నారు. ప్రతిష్టాత్మక కంపెనీలన్నీ ఇక్కడికి వస్తున్నాయన్నారు. జగన్ రెడ్డి సొంత నియోజకవర్గం పులివెందుల వారు ఫ్యాక్షన్ ప్రాంతంగా చేస్తే.. ముఖ్యమంత్రి చంద్రబాబు గారు అక్కడికి పరిశ్రమలు తీసుకొచ్చారని, సాగునీరు అందించారన్నారు. అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో కూడా రూ.1296కోట్లతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేసినట్టు వివరించారు. కేవలం రోడ్లు, డ్రైన్లు వంటి మౌళిక వసతుల కల్పనకే 200కోట్లు ఖర్చు చేశామన్నారు. రానున్న మూడేళ్లలో మరింత అభివృద్ధి చేసే విధంగా ముందుకెళు న్నామని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి తలారి ఆదినారాయణ, టిడిపి నగర అధ్యక్షుడు సుధాకర్ యాదవ్, ప్రధాన కార్యదర్శి ఫిరోజ్ అహ్మద్, టిడిపి జిల్లా ఉపాధ్యక్షుడు కృష్ణకుమార్, క్లస్టర్ ఇంచార్జ్ లు పొట్లూరి కేశవ నాయుడు, సరిపూటి రమణ, క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు స్వామిదాస్, టిడిపి నాయకులు దాసరి చంద్రకళ, లక్ష్మి, ప్రశాంతి, రాము, వన్నూరప్ప, బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్ రెడ్డి కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.





## ఎల్ నినో నేపథ్యంలో తాగునీటి విషయంలో జాగ్రత్తలు తీసుకోండి

- 4పంచాయతీల అధికారులకు ఎమ్మెల్యే దగ్గుపాటి ఆదేశం
- క్యాంప్ కార్యాలయంలో ఎంపీడీఓ, సెక్రటరీలు, ఎస్‌ఓలతో సమావేశం
- అభివృద్ధి పనులపై సమీక్ష, పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచాలని సూచన

*అనంతపురం, ఆగస్టు 12 అనంత సూర్య :*

ఎల్-నినో నేపథ్యంలో తాగునీటి సమస్య రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఎమ్మెల్యే దగ్గుపాటి ఆదేశించారు. తన క్యాంప్ కార్యాలయంలో 4 పంచాయతీల అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ, పంచాయతీల సెక్రటరీలు, స్పెషల్ ఆఫీసర్లు ఈ సమావేశంలో పాల్గొన్నారు. పంచాయతీల్లో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాల గురించి చర్చించారు. ప్రస్తుతం జరుగుతున్న పనుల్ని వేగవంతం చేయాలన్నారు. అలాగే కొత్త చేపట్టాల్సిన పనులపై ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. పంచాయతీల్లో ఎక్కడా రోడ్లు, డ్రైనేజీల సమస్యలు ఉండకూడదన్నారు. ప్రజా దర్బార్ కార్యక్రమంలో ప్రజలు కొన్ని సమస్యలు తన దృష్టికి తీసుకొచ్చారన్నారు. పారిశుద్ధ్య సమస్య మీద ప్రత్యేకంగా దృష్టి సారించాలన్నారు. వీధి లైట్ల సమస్యలు కూడా చెప్పారని.. ఇలాంటి చిన్న సమస్యలు మరోసారి రాకుండా చూసుకోవాల న్నారు. మరోవైపు ఎల్-నినో నేపథ్యంలో తాగునీటిని అత్యంత జాగ్రత్తగా వినియోగించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజలు ఎక్కడా తాగు నీటి సమస్యతో ఇబ్బంది పడకూడదని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ సూచించారు.



Editor, Published and Owned by C Hari Krishna, Published from D.no 1-3-780, Rajaka Nagar, Anantapur - 515001, Printed from NALIVELI EXPRESS PRINTERS Hno. 1-1A9T-10, Main Road, Pattikonda, Kurnool 518380, EDITOR : C HARI KRISHNA" Mobile number: 9182495405